డల్లాస్‌లో ఎమ్మెల్యే మల్లారెడ్డి పూజలు



మేడ్చల్: విదేశీ పర్యటనలో ఉన్న మాజీమంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి హనుమాన్ జయంతి సందర్భంగా డల్లాస్‌లోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికంగా ఉండే మిత్రులు, తెలుగువారితో కలిసి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంటనే సోదరుడు గోపాల్‌రెడ్డి ఉన్నారు.

విత్తనాల కొనుగోలులో జాగ్రత్త వహించాలి



గౌడవెళ్లి లో సూచనలిస్తున్న అధికారులు

మేడ్చల్: విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారులు రైతులకు సూచించారు. రైతు అవగాహన సదస్సులో భాగంగా మండలంలోని గౌడవెళ్లి, శ్రీరంగవరం గ్రామాల్లో శనివారం సదస్సులు నిర్వహించి రైతులకు అవగాహన కలిపించారు. వ్యవసాయ శాఖ గుర్తింపు పొందిన కంపెనీల విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలని, రసీదులను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరచాలని సూచించారు. వ్యవసాయ శాఖ అనుమతులు పొందిన డీలర్ల వద్ద నుంచి విత్తనాల ఎరువులు తీసుకోవాలని అన్నారు. సదస్సులో ఏఓ అర్చన, ఏఈఓలు సమితారెడ్డి, తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఐటీలో ఎకో ఫ్రెండ్లీ వర్క్‌షాప్



పేపర్‌బ్యాగులు తయారు చేస్తున్న విద్యార్థులు

మేడ్చల్ రూరల్: పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ ఐటీ కళాశాలలో ఎకో ఫ్రెండ్లీ వర్క్‌షాప్ నిర్వహించారు. మూడు రోజుల వర్క్‌షాప్‌లో విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని ఎకో ఫ్రెండ్లీ బ్యాగుల తయారీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్లాస్టిక్ బ్యాగ్‌ల వల్ల కలిగే అనర్థాలు, పేపర్ బ్యాగ్స్ ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు పర్యావరణ పరిరక్షలో తమ బాధ్యతను గుర్తు చేసుకునేలా అవగాహన కల్పించారు. కళాశాల డైరెక్టర్ జంగారెడ్డి, ప్రిన్సిపాల్ సత్యనారాయణ విద్యార్థులను అభినందించి పర్యావరణ ప్రాముఖ్యతను తెలిపారు. వర్క్‌షాప్‌లో హెచ్‌ఓడీ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లేఔట్‌లో ఖాళీ జాగా మున్సిపాలిటిదే: చైర్మన్



ఖాళీ జాగాను పరిశీలిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి తదితరులు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని యంనంపేట్‌లో సర్వే నంబర్ 137, 138లో ఉన్న ఖాళీ జాగాను చైర్మన్ కొండల్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నంబర్ 137, 138లోని శ్రీవేంకటేశ్వర హౌసింగ్ కాలనీ లేఔట్‌లో ఉన్న 8 వేల చదరపు గజాల ఓపెన్ స్పేస్ ల్యాండ్ మున్సిపాలిటీకే చెందుతుందన్నారు. ఈ స్థలం కబ్జాకు గురికాకుండా చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశామన్నారు. కొందరు వ్యక్తులు ఈ జాగాను కబ్జా చేసేందుకు హిటాచీలతో ఫెన్సింగ్ తొలగించారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చింతల రాజశేఖర్, స్థానిక నాయకుడు నల్లవెల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోయిన సైబర్ నేరగాళ్లు

- బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ అప్‌డేట్ చేయాలని మెసేజ్
- రూ. 72 వేలు కొట్టేసిన మాయగాళ్లు

ఘట్‌కేసర్: సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని పోలీసులు ఎంత ప్రచారం చేసినా ప్రజలు మారడం లేదు. బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ అప్‌డేట్ చేయాలని మెసేజ్ పెట్టి నగదు కొట్టేసిన సంఘటన శనివారం ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో జరిగింది. సీఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎదులాబాద్ గ్రామానికి చెందిన పాల వ్యాపారి బర్ల రాజ్ సెల్‌ఫోన్‌కు యూనియన్ బ్యాంక్ ఖాతాకు ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలని ఫోన్‌కు శనివారం మెసేజ్ వచ్చింది. మెసేజ్‌ను అతడి కుమారుడికి చూపించగా ఆధార్ అప్‌డేట్ చేయాలని వచ్చిందనడంతో అప్‌డేట్ చేయాలని కుమారుడికి సూచించాడు. దీంతో ఫోన్‌కు వచ్చిన లింక్‌ను క్లిక్ చేసి వచ్చిన ఓటీపీని ఎంటర్ చేశాడు. వెనువెంటనే రెండు దఫాలుగా రూ.72 వేలు డెబిట్ అయిందని మెసేజ్ వచ్చింది. దీంతో లబోదిబోమంటూ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఓఆర్ఆర్‌పై నుంచి లారీ పల్టీ



ఔటర్‌ఆర్‌పై నుంచి పల్టీ కొట్టిన లారీ


కీసర: ఔటర్ రింగ్ రోడ్డుపై నుంచి లారీ పల్టీ కొట్టిన సంఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శనివారం రాంపల్లి దాయర శివారులోని ఔటర్ రింగ్ రోడ్డుపై నుంచి లారీ పల్టీ కొట్టింది. ఈ సంఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. డ్రైవర్ సచిన్ సురక్షితంగా బయటపడ్డాడు. ప్రమాదానికి గురైన లారీ నెంబర్‌ను ఏపీ39టీఎక్స్ 5568గా గుర్తించారు.





ఆవిర్భావ వేడుకలకు అంతా సిద్ధం

సాక్షి,మేడ్చల్ జిల్లా: పది వసంతాల తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముస్తాబైంది. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు తెలంగాణ అవతరణ వేడుకలను నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఆవర్భావ వేడుకలను పురస్కరించుకుని శనివారం రాత్రి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని రంగు, రంగుల విద్యుత్తు లైట్లతో అలంకరించారు. కలెక్టరేట్ పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం ఉదయం 9 గంటలకు జిల్లా కలెక్టర్ గౌతమ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొంటారు. 30 నిమిషాల నుంచి గంట వ్యవధిలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ముగిసేలా కార్యక్రమాన్ని ఖరారు చేశారు. ఎలాంటి ఆర్భాటాలకు తావులేకుండా సాదాసీదాగా వేడుకలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించిన నేపథ్యంలో సంబంధిత అధికారులు కూడా అదే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు.



రంగు,రంగుల విద్యుత్ లైట్లతో కలెక్టరేట్ ముస్తాబు


ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



ఘట్‌కేసర్‌లో పూజలు నిర్వహిస్తున్న పూజారి వరదాచార్యులు



ఎదులాబాద్‌లో అన్నదానం చేస్తున్న లింగం ముదిరాజ్



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకుడు



అన్నదానం చేస్తున్న చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు

ఘట్‌కేసర్: హనుమాన్ జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ ఆలయాల్లో భక్తులు స్వామివారికి చందనం, తమల ఆకులతో అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. శివారెడ్డిగూడ శ్రీ వీరాంజనేయ ప్రసన్నంజనేయ స్వామి ఆలయం, గీతామందిర్‌లో స్వామి వారికి పూజలు, హోమం, ర్యాలీ నిర్వహించారు. బజరంగ్‌దళ్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గీతామందిర్‌లో చైర్‌పర్సన్ పావనీజంగయ్యయాదవ్ దంపతులు, మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్, ఎదులాబాద్‌లో లింగంముదిరాజ్ ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేశారు. పూజల అనంతరం పూజారి వరదాచార్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. నాగరాజ్ ముదిరాజ్, యూత్ నాయకుడు శివప్రదీప్‌రెడ్డి, రాంరెడ్డి, అంజిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నాగభూషణం, ఆంజనేయులు, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి

శామీర్‌పేట్: హనుమాన్ జయంతి సందర్భంగా తుంకుంట మున్సిపాలిటీతోపాటు శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల్లోని హనుమాన్ దేవాలయాల్లో వేడుకలు నిర్వహించారు. అభిషేక చందనపూజ, ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఉప్పరిపల్లిలోని పంచముఖి హనుమాన్ దేవాలయంలో అభిషేక చందనపూజ అనంతరం నిర్వహించిన అన్నదానంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



గీతామందిర్‌లో అన్నదానం చేస్తున్న చైర్‌పర్సన్ పావనీజంగయ్య దంపతులు



కీసరగుట్టలో పూజలు నిర్వహిస్తున్న నాగలింగం

కీసరలో ఘనంగా హనుమజ్జయంతి

కీసర: కీసరగుట్టలోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం హనుమజ్జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆంజనేయస్వామిని ధైర్యానికి ప్రతీకగా ఆరాధించారు. హనుమాన్ చాలీసాను పారాయణం చేయడంతోపాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నాగలింగం, ఈఓ నరేందర్, ఆలయ అర్చకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు

కీసర: హనుమజ్జయంతి సందర్భంగా చీర్యాల శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శనివారం ఉదయం స్వామివారికి అభిషేకం, మన్యసూక్త పారాయణం, వివిధ పుష్పాలతో అలంకరణ, తమలపాకులతో అర్చన, పంచ హారతులు ఇచ్చారు. అనంతరం చీర్యాల లక్ష్మీనరసింహస్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, కీసర మండల ఎంపీపీ మల్లారపు ఇందిరా లక్ష్మీనారాయణ, ధర్మకర్త శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో బజరంగ్‌దళ్ ర్యాలీని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ దంపతులు



ఉప్పరిపల్లిలోని పంచముఖి హనుమాన్ ఆలయ అన్నదానంలో భక్తులు

వైభవంగా కల్యాణ మహోత్సవం

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలం, ఉద్దమర్రి గ్రామంలోని అక్కన్న మాదన్న కాలంలో నిర్మించినటువంటి శ్రీ విష్ణు, శ్రీ శివాలయాల బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం జరిగిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి, శ్రీ భవాని రామలింగేశ్వరస్వామి స్వామివార్ల కల్యాణంలో భక్తులు, గ్రామస్తులతోపాటు సమీప గ్రామల్లోని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాలను వీక్షించారు. బీజేపీ సీనియర్ నేత ఈటల రాజేందర్, ఘట్‌కేసర్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, శామీర్‌పేట మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, ఎంసీ పల్లి మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు నర్సింహులుయాదవ్, పలువురు నాయకులు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి, శ్రీ భవాని రామలింగేశ్వరస్వామి వార్ల కల్యాణం



స్వామి వార్ల కల్యాణంలో పాల్గొన్న ముఖ్యులు

ప్రతి కొనుగోలుకు రసీదు తీసుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న సహాయ అధికారి జగదీశ్వర్

ఘట్‌కేసర్: వ్యవసాయశాఖ ద్వారా లైసెన్స్ కలిగి ఉన్న డీలర్ వద్దే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని, ప్రతి కొనుగోలుకు రసీదు తీసుకోవాలని వ్యవసాయ సహాయ అధికారి జగదీశ్వర్ అన్నారు. ఎదులాబాద్ రైతు వేదికలో విత్తనాలు, ఎరువుల కొనుగోలుపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువులు, విత్తనాల ప్యాకెట్లపై తయారీ, గడువు తేదీపై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. విత్తనాల ప్యాకెట్లను పంటకాలం పూర్తి అయ్యేవరకు జాగ్రత్త పరుచుకోవాలన్నారు. గడువు తీరిన విత్తనాలు కొనుగోలు చేయరాదని సూచించారు. కార్యక్రమంలో రైతులు సుక్కయ్య, శ్రీనివాస్, లింగం, రాజిరెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

పరీక్షల ఒత్తిడి తాళలేక విద్యార్థిని బలవన్మరణం

మేడ్చల్‌రూరల్: గ్రూప్-1, గ్రూప్-4 పరీక్షలకు సన్నద్ధమవుతున్న ఓ విద్యార్థిని పరీక్షల ఒత్తిడి తాళలేక బలవన్మరణానికి పాల్పడిన ఘటన మేడ్చల్ పట్టణంలో చోటు చేసుకుంది. మేడ్చల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నల్లగొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన కొమరాజు సంగీత(24), ఆమె సోదరుడు కృష్ణసాయి విద్యాభ్యాసం కోసం మేడ్చల్‌కు వచ్చి పట్టణంలోని రాఘవేంద్ర నగర్ కాలనీలో అద్దెకు నివాసం ఉంటున్నారు. సాయికృష్ణ రత్నదీప్ సూపర్‌మార్కెట్‌లో ఉద్యోగిగా పనిచేస్తుండగా కొమరాజు సంగీత(24) గత నాలుగు నెలల నుండి ఇంట్లోనే ఉంటూ గ్రూప్-1, గ్రూప్-4 పరీక్షలకు సన్నద్ధమవుతుంది. పరీక్షలు సమీపిస్తున్నాయని, మంచి ఉత్తీర్ణత సాధిస్తానో లేదోనని గుబులు చెందిన సంగీత గత శుక్రవారం రాత్రి సోదరుడు సాయికృష్ణతో చెప్పుకొని భయాందోళన వ్యక్తం చేసింది. శనివారం ఉదయం 9.30 సమయంలో సోదరుడు విధులకు వెళ్లగా సంగీత ఇంట్లో ఒంటరిగా ఉంది. ఈ క్రమంలో 11.30 గంటల సమయంలో సోదరుడు ఫోన్ చేయగా సంగీత ఎత్తకపోవడంతో అనుమానం వచ్చి వెంటనే ఇంటికి వచ్చాడు. తలుపులు తొలగించి లోపలికి వెళ్లి చూడగా సంగీత ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.



సంగీత (ఫైల్)



బలవన్మరణానికి పాల్పడిన సంగీత

విద్యుత్ సమస్యల పరిష్కారానికి వినతి



కీసర: కీసర దాయర గ్రామంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ శాఖ అధికారులకు గ్రామస్తులు శనివారం వినతిపత్రం అందజేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటం, లోఓల్టేజీ సమస్య, చిరుజల్లు పడితేనే కరెంట్ పోవడం వంటి సమస్యలు కీసర దాయర గ్రామంలో ఉన్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు అధికారులు సానుకూలంగా స్పందించి, సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్ వెహికల్స్ ప్రారంభం

అల్వాల్: జీహెచ్‌ఎంసీ అల్వాల్ సర్కిల్ పరిధిలో మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్ వెహికల్స్‌ను శనివారం అల్వాల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్ వెహికల్స్ అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో డీఈలు రంజిత్‌రెడ్డి, కార్తీక్, ఏఈలు లక్ష్మీ, రవళి, అరుణ్, మున్సిపల్ అధికారి లాలిష్, సిబ్బంది విజయ రామారావు తదితరులు పాల్గొన్నారు.

చెట్లపొదల్లో మహిళ మృతదేహం లభ్యం

జవహర్‌నగర్: దమ్మాయిగూడ ఆదర్శనగర్ డంపింగ్‌యార్డు వద్ద చెట్ల పొదల్లో ఓ మహిళ మృతదేహం లభించింది. జవహర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జవహర్‌నగర్ కార్మికనగర్‌లో నివసించే చెన్నమ్మ రెండవ కుమార్తె జ్యోతి (20) కూలి పనిచేస్తోంది. అయితే జ్యోతి కల్లుకు బానిస కావడంతో మొదటి భర్త శివ ఆమెను వదిలేశాడు. అనంతరం మహేష్ అనే వ్యక్తితో వివాహం జరిగింది. అయితే కల్లుకు బానిసైన జ్యోతిని వారు తల్లి వద్దకు పంపించారు. శుక్రవారం రోజులాగే పనికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. శనివారం ఆదర్శనగర్ మినీ డంపింగ్ యార్డు సమీపంలో చెట్ల పొదల్లో జ్యోతి మృతదేహం ఉందని స్థానికులు జ్యోతి సోదరికి, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. జ్యోతి కల్లు ఎక్కువగా సేవిస్తే మూర్ఛ వస్తుందని మృతురాలి తల్లి ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



జ్యోతి (ఫైల్)

టిప్పర్ పైనుంచి వెళ్లడంతో కార్మికుడి మృతి

మేడ్చల్‌రూరల్: టిప్పర్ వాహనం ఓ కార్మికుడి పైనుంచి వెళ్లడంతో అతడు అక్కడికక్కడే వ్యక్తి మృతి చెందాడు. మేడ్చల్ ఎస్ఐ మురళీధర్ తెలిపిన వివరాల ప్రకారం... సిద్దిపేట జిల్లా ములుగు మండలం బస్వాపూర్‌కి చెందిన బాలెంకి వెంకటయ్య(55) మేడ్చల్ మండలం రావల్‌కోల్ గ్రామ పరిధిలో ఉన్న రాక్ సిలికాన్ క్రషర్స్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రోజులాగే శనివారం విధులకు హాజరైన వెంకటయ్య మధ్యాహ్నం 12 గంటల సమయంలో పని ముగించుకుని ఎండ తీవ్రతకు తట్టుకోలేక ఆగి ఉన్న ఓ టిప్పర్ కింద కూర్చున్నాడు. దానిని గమనించని టిప్పర్ డ్రైవర్ వాహనాన్ని స్టార్ట్ చేసి ఒక్కసారిగా కదల్చడంతో అది వెంకటయ్య పైకి ఎక్కింది. వాహనం టైర్లు అతనిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మేడ్చల్ పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.



వెంకటయ్య (ఫైల్)

నలుగురు పాత నేరస్తుల రిమాండ్



ఘట్‌కేసర్ పోలీసులు రిమాండ్‌కు తరలించిన నిందితులు

ఘట్‌కేసర్: నలుగురు పాత నేరస్తులను ఘట్‌కేసర్ పోలీసులు శనివారం రిమాండ్‌కు తరలించారు. సీఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపాలిటీలోని మాధవరెడ్డి రైల్వే వంతెన సమీపంలోని కౌసల్యానగర్ కాలనీలో గత నెల 7న తాళం వేసిన పోచిరెడ్డి ఇంటిలో చోరీ జరిగింది. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన బొందల మల్లేశ్(40), భూపని ఆకాశ్(27), షేక్ అల్తాఫ్(23), వెంకటప్రసాద్(24) మల్లాపూర్ పారిశ్రామికవాడలో ఉంటూ చోరీలకు అలవాటుపడ్డారు. ఈ క్రమంలో గత నెల 7న తాళం వేసి ఉన్న పోచిరెడ్డి ఇంటిలోకి చొరబడి బీరువా పగులగొట్టి 41 గ్రామాల బంగారు ఆభరణాలు, 40 తులాల వెండి పూజాసామగ్రిని ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రంగంలోకి దిగి సీసీ ఫుటేజీలను పరిశీలించారు. శనివారం సాయంత్రం యంనంపేట్ చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకొని విచారించగా చోరీ చేసినట్లు తేలింది. వారి వద్ద నుంచి 41 గ్రామాల బంగారు ఆభరణాలు, 40 తులాల వెండి పూజా సామాగ్రి, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. మల్లేశ్‌పై పలు పోలీస్ స్టేషన్లలో 16 కేసులు, ఆకాశ్‌పై 7 కేసులు, వెంకటప్రసాద్‌పై 3 కేసులు ఉన్నాయి. అలవాటు మార్చుకుండా గత నెల 6న మల్లేశ్ చర్లపల్లి జైలు నుంచి విడుదలై మిగతా ముగ్గురితో కలిసి చోరీ చేశారు. ఈ మేరకు వారిని రిమాండ్‌కు తరలించారు.